కరుణించవమ్మా.. కల్పవల్లీ!

ఊరుకు కాపుకాచే తల్లి.. అంటు రోగాలను మాయం చేసే గంగమ్మ తల్లీ.. కరుణించవమ్మా కల్పవల్లీ.. అంటూ భక్తజనం అమ్మవారి కృప కోసం ప్రార్థిస్తారు. మే నెల మొదలైతే చిత్తూరుకు జాతరొచ్చినట్టే. మూడు రాష్ట్రాల్లో చిత్తూరు గంగ జాతరంటే ఓ ప్రత్యేకం.. ఇది ప్రస్తుతం జిల్లాలోనే పెద్దపండుగ. ఏటా ఈ జాతరను చిత్తూరువాసులు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నారు. మూడున్నర శతాబ్దాల క్రితం ఆవిర్భవించిన ఈ జాతర ఓ ప్రత్యేకత సంతరించుకుంటోంది. ఈ ఉత్సవమంటే చిత్తూరువాసులతోపాటు పక్కరాష్ట్రాల ప్రజలు తరలివస్తారు. ఈ నెల 16,17 తేదీల్లో గంగజాతరకు చిత్తూరు సిద్ధమవుతోంది. దీనిపై ప్రత్యేక కథనం.

- చిత్తూరు జాతరకు ఘన చరిత్ర
- కట్టుదిట్టంగా నిర్వహణ
- 16,17 తేదీల్లో గంగ జాతర
- అశేష సంఖ్యలో తరలివస్తున్న జనం



గంగ జాతర సందర్భంగా మొక్కులు చెల్లించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

చిత్తూరు రూరల్: ఒకప్పట్లో ఒక మారుమూలన చిత్తూరు గ్రామం ఉండేది. దాదాపు 350 ఏళ్ల క్రితం ఈ గ్రామంలో ప్లేగు వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపించాయి. ప్రతి ఇంటినీ ఈ వ్యాధి చుట్టుముట్టేసింది. దీంతోపాటు కలరా, మశూచి, క్షయ వ్యాధులు సైతం అప్పటి ప్రజలను వణికించాయి. ఈ వ్యాధులు ఒకసారి పంజా విసిరాయంటే ఊళ్లన్నీ వల్లకాడులా మారిపోయేవి. ఇలా చిత్తూరులో కూడా ఊర్లో ఒకరి తరువాత ఒకరు చనిపోవడం, ఆ వ్యాధి బారిన పడి పలువురు మంచమెక్కడం మొదలైంది. ప్రతి చైత్ర మాసంలోను ఎండల తీవ్రత అధికం కావడంతో ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతుండేవి. ఇలాంటి తరుణంలో వర్షాలు కూడా కురిసేవి కావు. ఈ విషయాన్ని గమనించిన ఊరి పెద్దలంతా ఏకమయ్యారు. ఊరంతా పుసుపు నీరు చల్లి, ఎల్లలో(ఊరి హద్దుల్లో) వేపాకు తోరణాలు కట్టారు. ఇక గంగమ్మ అనుగ్రహం, అమ్మను చల్లబరచాలని తీర్మానించారు. ఊరు నడివీధిలో మట్టితో చేసిన గంగమ్మ ప్రతిమను కొలువుదీర్చి, రాళ్లను పెట్టి కొలవడం ప్రారంభించారు. అమ్మకు ఇష్టమైన పదార్థాలు, అంబలితో పాటు కుంభం పోసి బలిదానాలు ఇచ్చేవారు. ఇలా చేయడం ద్వారా అమ్మవారు శాంతించి వ్యాధులు తగ్గుముఖం పట్టడం, వర్షాలు కురవడం మొదలైంది. దీంతో అప్పటి నుంచి గంగమ్మ కటాక్షం కోసం ఏటా జాతర చేయాలని నిర్ణయం తీసుకున్నారన్నది పెద్దల మాట. కాలక్రమేణా ఊరు పట్టణంగా, నగరంగా మార్పు చెందింది. అయినా వాడవాడలా గంగ జాతరలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఈ జాతరకు ఇప్పటి వరకు మూడున్నర శతాబ్దాలు పూర్తయిందంటున్నారు. చిత్తూరు నడివీధి గంగ జాతరకు వంశపారంపర్య ధర్మకర్తగా సీకే బాబు కుటుంబసభ్యులు ధర్మకర్తలు వ్యవహరిస్తూ వస్తున్నారు.

జాతర ఇలా...

ఇప్పుడు చిత్తూరు గంగ జాతర జరగాలంటే ముందు నిర్వాహకులు సమావేశమై నిర్ణయం తీసుకుంటారు. ఆపై జాతర నిర్ణయించుకున్న తేదీకి ముందు వచ్చే మంగళవారం చాటింపు వేస్తారు. చాటింపునకు ముందు ఎల్ల దేవతల అనుమతి కోరుతారు. అక్కడ పూజలు చేసి గ్రామానికి ఎలాంటి దుష్ట శక్తులు రాకుండా ఊరుకు నలుదిక్కుల వేపకులతో తోరణాలు కడతారు. దీంతో బయట ఉన్న జనం కూడా చిత్తూరుకు చేరుకుంటారు. ఇక్కడ జనం బయటకు వెళ్లకూడదని చెబుతుంటారు. చాటింపు తరువాత మంచి ముహూర్తంలో గ్రామ దేవతకు పొంగిళ్లు పెట్టి అమ్మవారి అనుమతితో పాటు శాంతిపూజలు చేస్తారు. ఈ పూజలు చేసిన తరువాతే చిత్తూరు నడివీధిలో గంగమ్మను ప్రతిష్టిస్తారు. ఆ తరువాత వచ్చే మంగళవారం ఉదయం అమ్మవారిని కొలువుదీర్చి తెర తొలగిస్తారు. ఆపై అమ్మవారికి భక్తులు ఉదయం అంబలి, రాత్రికి కుంభం పోసి దుష్టశక్తులు రాకుండా పూజలు చేస్తారు. మరుసటి రోజు సంప్రదాయబద్ధంగా జలధికి తరలిస్తారు. దీంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఓంశక్తి భక్తుల విన్యాసాలతో వినూత్నంగా మొక్కులు చెల్లిస్తారు. ఇలా గత కొన్నేళ్లుగా చిత్తూరులో గంగజాతర అంగరంగ వైభవంగా నడుస్తోంది. దీంతో పాటు కొంగారెడ్డిపల్లి, కట్టమంచి, గిరింపేట, దొడ్డిపల్లి, సంతపేట తదితర ప్రాంతాల్లో కూడా జాతర అట్టహాసంగా కొనసాగుతోంది.

పొరుగురాష్ట్రాల చూపు

ఈ రెండు రోజుల జాతరను చూసేందుకు పొరుగు రాష్ట్రాలు కూడా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుంటాయి. మంగళవారం నుంచి జరిగే జాతరను తిలకించేందుకు భారీ సంఖ్యలో తరలివస్తారు. పూజలు చేయడంతో పాటు వినూత్న రీతిలో మొక్కులు చెల్లించుకుంటారు. అమ్మవారికి పెద్దమొత్తంలో కానుకలు సమర్పించుకుంటున్నారు. నగదు పాటు పసుపు, కుంకుమ, చీరలు, వెండి, బంగారు ఆభరణాలు కూడా సమర్పిస్తారు.



గంగమ్మ తల్లి (ఫైల్)

30న పాలేటమ్మ జాతర

ఐరాల: మండల కేంద్రంలో 30వ తేదీ మంగళవారం నుంచి రెండు రోజులపాటు పాలేటమ్మ గంగజాతర నిర్వహించనున్నట్లు ఆలయ వంశపార్యంపర ధర్మకర్త ఎంకే బాలాజి తెలిపారు. 22వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలకు అమ్మవారి అభిషేకం, రాత్రి 8.30 గంటల నుంచి 12 గంటల వరకు గంగచాటు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 30వ తేదీ ఉదయం అమ్మవారి శిరస్సు ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు చెప్పారు. 31న బుధవారం అమ్మవారి నిమజ్జనం ఉంటుందని చెప్పారు. భక్తుల కాలక్షేపం కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

క్లుప్తంగా

అభయాంజనేయస్వామి సేవలో సినీ నటుడు



కిరణ్ అబ్బవరానికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఐరాల: మండలంలోని పుత్రమద్దిలో నూతనంగా వెలసిన అభయాంజనేయస్వామిని శుక్రవారం సినీ నటుడు కిరణ్ అబ్బవరం దర్శించుకున్నారు. యూట్యూబ్ ఛానల్ ×చిత్తూరు కుర్రోడు¤తో ఫేమస్ అయిన పుత్రమద్దికి చెందిన తేజ ఆహ్వానం మేరకు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కాలువ సమస్య పరిష్కారం



కాలువ సమస్యపై గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలోని పోటుకనుమ గ్రామ కాలువ సమస్యను శుక్రవారం ఎంపీడీఓ గౌరి పరిష్కరించారు. గత వారం గ్రీన్అంబాసిడర్లు గ్రామంలోని కాలువలో చెత్త, చెదారాన్ని తొలగిస్తున్నపుడు ఆ గ్రామానికి చెందిన కొందరు అడ్డుపడి, పనులను నిలిపివేసినట్లు ఎంపీడీఓకి ఫిర్యాదు చేశారు. ఆమె శుక్రవారం వారితో మాట్లాడి పనులను వేగవంతం చేయించారు. అనంతరం సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రామంలో అభివృద్ధికి అడ్డుపడే సమయంలో అధికారులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఎన్ఆర్పేట ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎన్ఆర్ పేటలోని ప్రభుత్వ ఐటీఐలో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సాంబమూర్తి తెలిపారు. కోఫా, మెకానికల్ డీజిల్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ మోటర్ వెహికల్, డీమెన్ సివిల్ కోర్సులు ఉన్నాయని, ఇందుకు 10వ తరగతి పాసైన విద్యార్థులు అర్హులని చెప్పారు. ఆసక్తిగలవారు జూన్6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పేదలకు వస్త్రదానం



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

బంగారుపాళెం: మండల కేంద్రంలో శుక్రవారం నలగాంపల్లెకు చెందిన దాత పేదలకు వస్త్రదానం చేశారు. నలగాంపల్లెకు చెందిన ఎన్ఆర్ఐ వల్లేరు కళ్యాణ్ తన కుమార్తె విభ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పేదలకు అన్నదానంతో పాటుగా కొత్త దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మోడల్స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తులు

కుప్పం: మండల పరిధిలోని నడుమూరు మోడల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హరణి తెలిపారు. పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ఉందని పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా దరఖాస్తు దాఖలుకు ఈనెల 25వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. జూన్ 11వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

ఎస్జీబీ మేనేజర్గా తిరుమల

తవణంపల్లె: మండల కేంద్రంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్గా తిరుమల శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ మేనేజర్గా పని చేసిన కామాక్షి కల్యాణి తిరుపతికి బదిలీ అయ్యారు. పూతలపట్టు సప్తగిరి గ్రామీణ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్గా పని చేస్తున్న తిరుమలను పదోన్నతిపై సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్గా ఇక్కడికి వచ్చారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

గుడిపాల: జగనన్నకు చెబుదాంలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్జీదారులు సమస్యలను ఫిర్యాదుచేసిన 48 గంటల్లో వీఆర్ఓలు పరిష్కరించాలని ఆయన తెలియజేశారు. జగనన్న ఇంటి పట్టాలకు సంబంధించి భూములను గుర్తించాలని చెప్పారు. 90 రోజుల స్కీములో భాగంగా ఇంటి పట్టాలను లబ్ధిదారులకు ప్రభుత్వం త్వరలో ఇవ్వనున్నట్లు వివరించారు. ఇందుకు గాను ఆయా పంచాయతీల్లో భూములను చూసి జియోట్యాగింగ్ చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ కల్యాణి పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ వెలుగులు



పీ.కట్టకిందపల్లెలో పర్యటిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: బడుగు, బలహీన వర్గాలను గుర్తించి అర్హులైన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని పాలకల-2 సచివాలయ పరిధిలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బెల్లంగోవిందపల్లె, బెల్లంగోవిందపల్లె ఎస్టీ కాలనీ, కట్టకిందపల్లె, దళితవాడ, గొల్లపల్లె, యల్లంపల్లె, యల్లంపల్లె దళితవాడ, యల్లంపల్లె ఎస్టీకాలనీల్లో పర్యటించారు. ఉదయాన్నే గ్రామాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు ఆయా గ్రామస్తులు హారతులు, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. సంక్షేమ బావుటా బుక్లెట్లను పంపిణీ చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యే 530 ఇళ్లను సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి పథకాలు వర్తింపజేస్తామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రారంభించారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, పేద ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జగనన్నను ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించి 2024లో మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీపీ మోహన్, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్రెడ్డి, సర్పంచ్ శాంతిసాగర్రెడ్డి, పాలకల సర్పంచ్ సాగర్రెడ్డి, తహసీల్దార్ సుశీలమ్మ, ఎంపీడీఓ నిర్మలాదేవి పాల్గొన్నారు.

నేడు పాలకల-2లో గడప గడపకు

మండలంలోని పాలకల-2 సచివాలయ పరిధిలో శనివారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నిర్మలాదేవి తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని ఆదేశించారు.

చెబితే అర్థం కాదా..?

సాక్షి ఎఫెక్ట్..

- ఈఓపీఆర్డీల సమావేశంలో డీపీఓ లక్ష్మి ఆగ్రహం

చిత్తూరు కార్పొరేషన్/యాదమరి : సచివాలయాలలో కార్యదర్శులు రెండు క్యాష్ బుక్స్ పెట్టుకోవడం ఏంటి?, ప్రజలకు అందుబాటులో లేరంటూ పత్రికలలో వస్తుంటే ఈఓపీఆర్డీలు ఏం చేస్తున్నారు? అని శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీపీఓ లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ×సాక్షి¤ దినపత్రికలో గురువారం ×కాలక్షేపంలో కార్యదర్శులు¤ అనే శీర్షికన వచ్చిన కథనంపై కలెక్టర్, జెడ్పీ సీఈఓ సీరియస్గా ఉన్నారని ఆమె తెలిపారు. ఈవోపీఆర్డీలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్లో పలు అంశాలపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శులు, ఈవోపీఆర్డీల పనితీరుపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. ఈవోపీఆర్డీలు ప్రతి రోజూ ఒక వర్మీ కంపోస్టుయార్డును తనిఖీ చేయాల్సి ఉన్నా ఎవరూ చేయడం లేదన్నారు. కుప్పం, వెదురుకుప్పం, తవణంపల్లె ఈవోపీఆర్డీల పనితీరు బాగా లేదని గుర్తుచేశారు. వారు పని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. సిటిజన్ చార్ట్ ప్రకారం సేవలు సకాలంలో అందడం లేదని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ లేదన, ట్యాంక్ క్లీనింగ్ రిజిస్ట్రేషన్ ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. యాదమరి మండలంలో కార్యదర్శులు రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడంపై జెడ్పీ సీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారని చెప్పారు. ప్రతి సోమవారం సచివాలయంలో స్పందన నిర్వహించాలని చెప్పారు. సచివాలయంలో కార్యదర్శులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. క్లాప్మిత్ర, పారిశుద్ధ్య నిర్వహణపై ఈవోపీఆర్డీల పనితీరు సంతృప్తికరంగా లేదని, ఇకనైనా తీరు మార్చుకోవాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేసవి శిక్షణ శిబిరంలో అబాకస్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉచితంగా నిర్వహిస్తున్న వేసవి శిబిరానికి ఆదరణ లభిస్తోంది. బాలబాలికలు పలు రంగాలపై అవగాహన పెంపొందించుకుంటున్నారు. శుక్రవారం పిల్లలకు అబాకస్, మోటివేషన్ స్కిల్స్, టైంమేనేజ్మెంట్, పాటలు పాడటం, కథలు చెప్పడం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి లావణ్య, ఉపగ్రంథాలయాధికారి గజేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి రుణాలు

గుడిపాల: జగనన్న ఇంటి నిర్మాణాలు చేపట్టే మహిళా గ్రూపులకు రుణాలను అందజేయాలని ఇందిరాక్రాంతి ఏపీఎం ఈశ్వరి అన్నారు. ఐకేపీ భవనంలో శుక్రవారం సంఘమిత్రలకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జగనన్న ఇంటి నిర్మాణాలు చేపట్టే మహిళలకు రూ.35 వేల నుంచి రూ.లక్ష వరకు స్త్రీనిధి, బ్యాంకుల ద్వారా రుణాలను అందజేయాలన్నారు. గ్రామాల్లో మహిళలు ఎవరైనా గ్రూపుల్లో చేరకుండా ఉన్నట్లయితే వారందరినీ గ్రూపుల్లో చేర్పించే విధంగా చూడాలని చెప్పారు. పారిశ్రామిక మహిళా వేత్తలుగా మహిళా సంఘ సభ్యులను చేయాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, హేమచంద్రారెడ్డి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించండి

చిత్తూరు అర్బన్: సచివాలయ సిబ్బంది వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్రెడ్డి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని చామంతిపురం సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ కార్యకలాపాలను పరిశీలించారు. స్పందన అర్జీల్లో అలసత్వం వద్దని సిబ్బందికి సూచించారు. వేసవి దృష్ట్యా వార్డులో నీటి ఎద్దటి తలెత్తకుండా చూడాలన్నారు. గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి



మాధవరం ఎస్టీ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న డీపీఓ లక్ష్మి, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి

తవణంపల్లె: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి ఆదేశించారు. మండలంలోని మాధవరం ఎస్టీ కాలనీలో వీధి సమస్యపై స్పందన కార్యక్రమంలో ఎస్టీలు అర్జీ ఇచ్చారు. దీనిపై స్పందించి శుక్రవారం మాధవరం ఎస్టీ కాలనీని డీపీఓ లక్ష్మి, తవణంపల్లె ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమణ, సచివాలయ సిబ్బందితో సందర్శించారు. వీధి సమస్యపై ఎస్టీ కాలనీవాసులతో మాట్లాడారు. ఎస్టీ కాలనీలో ఓ వ్యక్తి వీధిని ఆక్రమించి ఇల్లు కట్టాడని గతంలో కూడా స్పందనలో అర్జీ ఇచ్చారని డీపీఓ తెలిపారు. దీనిపై చిత్తూరు ఆర్డీఓ రేణుక, తహసీల్దార్ సుశీల, సర్వేయర్లు, వీఆర్ఓలు ఎస్టీ కాలనీకి సందర్శించి వీధిలో వేసిన సిమెంట్ రోడ్డును తొలగించినట్లు పేర్కొన్నారు. తర్వాత కట్టిన ఇల్లును తొలగించి వీధిని వెడల్పు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్కు స్పందనలో విజ్ఞప్తి చేసి అర్జీ ఇచ్చారు. దీనిపై డీపీవో లక్ష్మి పరిశీలించి కాలనీలో రెవెన్యూ రికార్డుల మేరకు ఆక్రమణ లేదని స్పష్టం చేశారు. మరోసారి రెవెన్యూ అధికారులతో ఎస్టీ కాలనీవాసుల సమక్షంలో రీసర్వే చేయించి పూర్తి స్థాయిలో పరిష్కరించాలని ఎంపీడీఓను ఆదేశించారు. స్పందనలో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తేనే సమస్య పరిష్కారమవుతుందని వివరించారు.

గ్రామీణులకు ఫ్యామిలీ డాక్టర్ సేవలు



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కఠారి కుమార్

ఐరాల: మండలంలోని దివిటీవారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక పీహెచ్సీ వైద్యాధికారి ప్రవీణ్కుమార్ 104 వైద్య శిబిరంలో 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా ప్రభుత్వాస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ శంకరమ్మ, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్

189 కొత్తపల్లెలో..

గుడిపాల: ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కఠారి కుమార్ అన్నారు. మండలంలోని 189కొత్తపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన తమ సిబ్బందితో కలిసి రోగులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇంటివద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. ఆయన 60 మంది రోగులకు వైద్యసేవలు అందజేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది సుమతి, చంద్ర, హరిప్రియ, ప్రవీణ్, ఎలవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యాగణపతి ఆలయ కుంభాభిషేక పూజలు



కుంభాభిషేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం నల్లప్పనాయుడు కండ్రిగలో శ్రీ విద్యాగణపతి దేవస్థాన జీర్ణోద్ధారణ కుంభాభిషేక, విగ్రహ ప్రతిష్ఠ పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పెద్దలు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి స్వామి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం దుశ్శాలువతో సన్మానించి ప్రసాదం అందజేశారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ

ఎస్.రెడ్డెమ్మ ఆధ్వర్యంలో 34వ వార్డులోని ధర్మరాజుల ఆలయం వద్ద ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భూమి పూజ చేశారు. ప్లాంట్ నిర్మాణాన్ని త్వరతగతిన పూర్తి చేసి, స్థానిక ప్రజలకు ఉచిత మినరల్ వాటర్ను అందిస్తామని ట్రస్టు నిర్వాహకులు త్రిమూర్తి తెలిపారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగజాతరకు పటిష్ట బందోబస్తు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

చిత్తూరు అర్బన్: చిత్తూరు గంగజాతర ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ఇతర శాఖాధికారులతో శుక్రవారం ఆయన చిత్తూరు పోలీస్ గెస్ట్ హౌస్లో సమావేశం నిర్వహించారు. నగరంలో 16, 17తేదీల్లో జరిగే గంగజాతరకు పోలీస్ సిబ్బందితో పాటు, అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జాతర నిర్వహించే ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నిర్దేశిత ప్రదేశాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. పిక్ పాకెటింగ్, ఆకతాయిల వెకిలి చేష్టల నివారణకు నిష్ణాతులైన క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక క్రైమ్ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ట్యాగింగ్ సిస్టంను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. జాతర ప్రదేశాలలో మైకులు అమర్చి చిత్తూరు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్కు అనుసంధానించి నిరంతరం పర్యవేక్షిస్తామని ఆయన పేర్కొన్నారు.



హాజరైన జాతర నిర్వాహకులు